యాదగిరీశుడి క్షేత్రంపై 'హరి'విల్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంపై శనివారం ఇంద్ర ధనస్సు దర్శనమిచ్చింది. సాయంత్రం వర్షం కురిసిన కాసేపటికి స్వర్ణమయంగా ఉన్న దేవస్థానం మీద అద్భుతం ఆవిష్కృతమైంది. భక్తులు, స్థానికులు ఈ దృశ్యాన్ని తమ సెల్ ఫోన్లలో బంధించారు. – యాదగిరిగుట్ట

ప్లీజ్.. మమ్మల్ని వదిలి వెళ్లొద్దు టీచర్

తమ ఉపాధ్యాయురాలు వెళ్లిపోతున్నారని తెలిసి పసిమనసులు కలత చెందాయి. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి ప్రాథమిక పాఠశాలలో పాలకూరి జ్యోతి 11 ఏండ్ల నుంచి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమె పదోన్నతిపై ఆత్మకూర్.ఎస్ మండలంలోని కొత్త తండా పాఠశాలకు బదిలీ అయ్యారు. శనివారం ఆమె వెళ్లిపోతుండగా.. 'మమ్మల్ని, మా బడిని వదిలి వెళ్లొద్దు టీచర్' అంటూ విద్యార్థులు ఆమె చుట్టూ చేరి ఏడ్చారు. –తుంగతుర్తి

• పీవీ మునిమనువరాలి పెండ్లికి రండి



హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మునిమనుమరాలు వివాహ ఆహ్వాన పత్రికను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు పీవీ కుటుంబసభ్యులు అందజేశారు. శనివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఆమె అక్క కొడుకు సుధాకిరణ్ కలిశారు.

స్టార్టప్స్‌కు కేరాఫ్‌గా హైదరాబాద్: కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరాన్ని స్టార్టప్ సంస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దామని, ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ అనే మూడు సూత్రాలతో నగరంలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను నిర్మించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. తార్నాకలోని సీసీఎంబీలో శనివారం జరిగిన ఇన్సాకాన్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కల్పించాలంటే స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించడమే సరైన మార్గమని తాను భావించానని చెప్పారు. యువతలోని నైపుణ్యానికి సరైన ఆర్థిక వనరులు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న నమ్మకంతో టీ హబ్, టీ వర్క్స్, ఇమేజ్ టవర్స్ పేరుతో దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ సెంటర్‌ను హైదరాబాద్‌లో తీర్చిదిద్దామని అన్నారు. ఒకేసారి రెండు వేల స్టార్టప్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహించుకునేలా ప్రారంభమైన టీ హబ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నదని తెలిపారు. 2014లో నగరంలో 200 స్టార్టప్ కంపెనీలు ఉంటే ప్రస్తుతం ఐదు వేలకు పైగా పనిచేస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రతన్‌టాటా లాంటి గొప్ప వ్యక్తి టీ హబ్‌ను సందర్శించి ఆధునిక భారత ముఖచిత్రం అంటూ ప్రశంసించారని తెలిపారు. యువత, మహిళలు, గ్రామీణుల్లోని గొప్ప వ్యాపార ఆలోచనలకు కార్యరూపం దాల్చేవిధంగా టీహబ్, టీ వర్క్స్, ఇమేజ్ టవర్స్, టాస్క్, వీ హబ్ వంటి వాటిని ఏర్పాటు చేశామని చెప్పారు. మన దేశం స్వదేశీ టెక్నాలజీతో ప్రయోగించిన మొదటి శాటిలైట్ ప్రయోగంలో హైదరాబాద్‌లోని స్టార్టప్ కంపెనీయే కీలక పాత్ర పోషించిందని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఉన్న మొత్తం స్టార్టప్ కంపెనీలు ఏటా 3.5 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చెప్పారు.

తప్పు చేస్తే కంపెనీలపై కేసులుండవా?

మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కన్సల్టెంట్ సంస్థ మెయిన్‌హార్ట్‌పై పాకిస్తాన్‌లో కేసులు ఉన్నాయనే అంశంపై మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. శనివారం సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. తప్పులు చేస్తే ఏ కంపెనీపై అయినా కేసులు పడతాయని పేర్కొన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాకే మూసీ ప్రాజెక్టు ఖర్చు తేలుతుందని చెప్పారు. కన్సల్టెంట్ సంస్థకు 140కోట్లతో ఆర్డర్ ఇచ్చామని, ఏడాదిన్నరలో నివేదిక అందుతుందని తెలిపారు. మూసీ వెంబడి నివసిస్తున్న 10వేల మందిని తరలిస్తున్నామని, వారికి డబుల్ బెడ్రూమ్ ఇంటితోపాటు రూ. 25వేల చొప్పున ఇస్తున్నట్టు తెలిపారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును అడ్డుకుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇళ్లను ముట్టడిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. అసలు మూసీ ఎక్కడుందో కూడా కిషన్‌రెడ్డికి తెల్వదని ఎద్దేవా చేశారు.

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కూతురు సుస్మిత నీట్‌లో ప్రతిభ కనబరిచి ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆర్థికస్థోమత లేని కారణంగా సుస్మిత సీటును వదులుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో పేద విద్యార్థిని ఇబ్బందులను పవన్‌కుమార్.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎక్స్‌లో ట్యాగ్ చేశారు. శనివారం కేటీఆర్ స్పందించి సుస్మితకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటానని రీట్వీట్ చేశారు.

సియోల్ ఎందుకు దండగ.. 'మెయిన్' ప్రాజెక్టులు ఉండగ

- నాడు మాట.. నేడు రూటు మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- గొప్ప కంపెనీ అంటూనే సంబంధం లేని చోటుకు స్టడీ టూర్
- మెయిన్‌హార్ట్ ప్రాజెక్టులను వదిలి దక్షిణకొరియాకు రాష్ట్ర ప్రతినిధుల బృందం
- ఏ నదికి తీసుకెళ్తున్నారనేది ప్రస్తావించకుండానే ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): 'మెయిన్‌హార్ట్ ఎంతో పెద్ద కన్సల్టెన్సీ. మెయిన్‌హార్ట్ కంపెనీకి ప్రధాని మోడీ 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' నిర్మాణ బాధ్యతను అప్పగించారు. అందుకే హైదరాబాద్ నగర సమగ్ర ప్రాజెక్టు నివేదిక బాధ్యతను ఆ కంపెనీకి అప్పగించాం' ఇదీ... సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణపై నిర్వహించిన మీడియా సమావేశంలో మెయిన్‌హార్ట్ కంపెనీపై కురిపించిన ప్రశంసల జల్లు. మరి ఇంత గొప్ప కంపెనీ చేసిన అద్భుతాలను చూడాలనే ఆత్రుత ప్రతి ఒక్కరికీ ఉండటం సహజం. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులతో కూడిన ఒక బృందాన్ని రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సందర్శించేందుకు విదేశీ పర్యటన ఖరారు చేసింది. కానీ రేవంత్ ప్రభుత్వం మెయిన్‌హార్ట్ కంపెనీకి ఎలాంటి సంబంధంలేని రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించేందుకు సదరు బృందాన్ని దక్షిణ కొరియాలోని సియోల్ తీసుకుపోతున్నది. మరి... ఆ కంపెనీ పని తీరు ఏందో సదరు బృందానికి చూపిస్తే కదా... వాళ్లంతా ఇక్కడికి వచ్చి సీఎం రేవంత్ చెప్పినట్టు మెయిన్‌హార్ట్ అద్భుతాలను సృష్టించే అమోఘమైన కంపెనీ అని తెలంగాణ ప్రజలకు చెప్పేవాళ్లు. కానీ ఎందుకు ఇతర ప్రాజెక్టు సందర్శనకు బృందాన్ని తీసుకుపోవడం వెనుక మర్మమేమిటి? ఇదే ఇప్పుడు అందరిలో కలుగుతున్న సందేహం.

మూడు చోట్లా మూడు కథలు...

మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రపంచంలోనే మూడు రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టింది.

- పాకిస్తాన్‌లోని రావి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై మొదటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు అనుమానాస్పదంగానే ఉన్నాయి. అంచనా వ్యయం పెరగడం..పేదల ఇండ్లను కూల్చివేయడం, మాస్టర్‌ప్లాన్ ఈవోఐ టెండర్లలో గోల్‌మాల్ చేసి మెయినహార్ట్ కంపెనీకి బాధ్యతలు అప్పగించడం.. ఇలా ప్రతి దశలోనూ మూసీ ప్రాజెక్టు వెనుక అనుమానాలు ఉన్నాయి. ఇటీవల మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రపంచంలోనే దిగ్గజ కంపెనీగా చెప్పారు. గతంలో ఇలాంటి ఎన్నో ప్రాజెక్టులు ఆ కంపెనీ చేసి చూపించిందని సచివాలయంలోనే గ్రాఫిక్స్ రూపంలో ప్రదర్శించారు. అలాంటప్పుడు మూసీ లెక్కనే ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో ఆ కంపెనీ చేపట్టి, పూర్తి చేసిన ప్రాజెక్టులను సందర్శించేందుకు ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులను తీసుకుపోవడంలో అర్థముంటుంది.
- మెయిన్‌హార్ట్ కంపెనీ గుజరాత్‌లోని సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును చేపట్టింది. ఇక్కడ కూడా అంచనాలు పెంచింది. ఇప్పటివరకు ప్రాజెక్టులో మురుగునీటి శుద్ధి అనేదే జరగలేదు. అంతేకాదు ప్రాజెక్టులో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ నిర్మాణంలో ఒప్పందం మేరకు పటేల్ కప్పుకున్న శాలువాపై స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను కూడా పొందుపరచాలి. కానీ అదేమీ లేకుండా, అసంపూర్తిగానే విగ్రహాన్ని పూర్తి చేసింది.
- థాయిలాండ్ రాజధానిలో ఉన్న కనపాయ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును మెయిన్‌హార్ట్ కంపెనీనే చేపట్టింది. మాస్టర్‌ప్లాన్, డిజైన్లు, గ్రాఫిక్స్ మాయాజాలాన్ని సృష్టించి... అంచనా వ్యయాన్ని రూ. 40వేల కోట్ల నుంచి రూ.2.50 లక్షల కోట్లకు పెంచింది. పేదల తరలింపులో పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో పాటు మెయిన్‌హార్ట్ కంపెనీ అవినీతికి పాల్పడటంతో ఆ ప్రాజెక్టు అర్ధాంతరంగా నిలిచిపోయింది. కంపెనీ ప్రతినిధులపై అక్కడి ప్రభుత్వం కేసులు పెట్టి, రెడ్‌కార్నర్ నోటీసులు కూడా జారీ చేసింది.

చింది. కానీ అక్కడి ప్రభుత్వం అర్ధాంతరంగా కంపెనీని ఆ బాధ్యతల నుంచి తప్పించింది.

సియోల్‌కు మెయినహార్ట్‌కు సంబంధం ఏంది?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు మీడియా ప్రతినిధులను ఆదివారం దక్షిణ కొరియాలోని సియోల్‌కు తీసుకెళ్తున్నది. ఈ నెల 21–24వ తేదీ వరకు బృందం అక్కడ పర్యటించి, రివర్‌ఫ్రంట్‌ను పరిశీలిస్తుందని ఈ నెల 14న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. విదేశీ పర్యటనకు వెళ్లినపుడు ఆ బృందం ఏ ప్రాంతంలో, ఏమి పరిశీలిస్తుందనే వివరాలను పొందుపరచడం సర్కారు కనీస బాధ్యత. కానీ రేవంత్ ప్రభుత్వం ఈ ఉత్తర్వుల్లో సదరు బృందం ఏ నదిని సందర్శిస్తుందో కనీసం పొందుపరచకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. నది పేరును దాచాల్సిన అవసరమేముందనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఈ క్రమంలో అసలు సియోల్‌లో ఉన్నది చియోంగ్‌చియాన్ అనే రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు. అది కూడా వాగుపై చేపట్టిన ప్రాజెక్టు. దానిని అక్కడి సియోల్ డెవలప్‌మెంట్ అథారిటీ అంటే ప్రభుత్వపరంగానే చేపట్టారు. మరి మూసీని ఉద్ధరించనున్న మెయిన్‌హార్ట్ కంపెనీకి థాయిలాండ్ ప్రభుత్వమే చేసిన చియోంగ్‌చియాన్ అనే రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఏం సంబంధమో కాంగ్రెస్ ప్రభుత్వానికే తెలియాలి.

ఇంజినీరింగ్ సీట్లను పెంచుతారా? లేదా?

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ):ఏఐసీటీఈ,జేఎన్‌టీయూ ఆమోదించిన ప్రకారంగా ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపునకు అనుమతించాలని గత నెల 9 న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అవి అమలు కాలేదని కేఎంఆర్, ఎంఎల్ఆర్, ఎంఎస్ఆర్, సీఎంఆర్ తదితర సంస్థలు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ జరిపింది. ఇంజినీరింగ్ సీట్ల పెంపు ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని ప్రభుత్వానికి స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

మా ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదు?

నిర్మాణ అనుమతుల మంజూరులో హెచ్ఎండీఏతీరును హైకోర్టు ఆక్షేపించింది. అక్షయ డెవలపర్స్ దరఖాస్తును పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని ఆగస్టు 30న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను నిలదీసింది.హెచ్ఎండీఏ కమిషనర్‌తోపాటు టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యాధర్ వ్యక్తిగతంగా విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ.. విచారణను నవంబర్ 15కి వాయిదా వేసింది.

కోర్టు ధిక్కరణపై చర్యలు తప్పవు

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ గత మేనేజింగ్ కమిటీ అవకతవకల నివేదికపై చర్యలు చేపట్టాలన్న ఆదేశాలు అమలు కాకపోవడంతో హైకోర్టు మరోసారి ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.ఇప్పటికే కోర్టు ధిక్కార నోటీసులు ఇచ్చినా ఎందుకు స్పందించలేదని ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ వ్యవహారంలో సహకార శాఖ కమిషనర్ హరిత వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. విచారణ నివేదికను పిటిషనర్ మురళీ ముకుంద్‌కి అందజేశామని, కౌంటర్ వేస్తామని ఆమె తరపున ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీంతో హైకోర్టు ఆదేశించాక నివేదిక ఇవ్వడం ధిక్కరణే అవుతుందని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినట్టు తేలితే శిక్ష తప్పదని పేర్కొంటూ.. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేశారు.

'సికింద్రాబాద్ బంద్' ఉద్రిక్తం

- ముత్యాలమ్మ గుడివద్ద ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ
- ఆందోళనకారులపై లాఠీలకు పనిచెప్పిన పోలీసులు
- బంద్‌తో స్థానికంగా నెలకొన్న కర్ఫ్యూ వాతావరణం

ముత్యాలమ్మ గుడివద్ద పోలీసుల లాఠీచార్జ్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 19: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన దాడికి నిరసనగా పలు ధార్మిక సంఘాలు ఇచ్చిన 'సికింద్రాబాద్ బంద్' పిలుపు శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణలో ఇరువైపులా పలువురు గాయపడ్డారు. ఆందోళనకారులను నిలువరించే క్రమంలో పోలీసులు తమ లాఠీలకు పనిచెప్పగా.. ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు, చెప్పులు విసిరారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడికి నిరసనగా కొన్ని ధార్మిక సంఘాలు శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో ర్యాలీ నిర్వహించాయి. సికింద్రాబాద్ మహంకాళి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ముత్యాలమ్మ ఆలయం వరకు సాగింది. అక్కడ ఆందోళనకారులు బైఠాయించి ధర్నాకు దిగారు. నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ అక్కడికి చేరుకొని వారిని ఆందోళన విరమించాలని కోరారు. ఇంతలో ఆందోళనకారులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ స్థానికంగా ఉన్న మరో వర్గానికి చెందిన ప్రార్థనామందిరం వైపు వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు, చెప్పులు విసిరారు. పరిస్థితి చేజారిపోతుండడంతో పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. దాడికి గురైన ఆలయం తోపాటు స్థానికంగా ఉన్న ఇతర ప్రార్థనా మందిరాల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

మెట్రోపొలిస్ హోటల్‌పై దాడి

ఆలయంపై దాడిచేసిన దుండగులు బసచేసిన మెట్రోపొలిస్ హోటల్‌పై ఆందోళనకారులు రాళ్ల దాడికి దిగారు. పెద్దసంఖ్యలో ర్యాలీగా వచ్చిన ఆందోళనకారులు కుమ్మరిగూడ వద్దకు రాగానే రెండు గుంపులుగా విడిపోయి కొందరు ఆలయం వద్దకు, మరికొందరు మెట్రోపొలిస్ హోటల్ వద్దకు చేరుకున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు హోటల్ గేట్‌కు తాళం వేసి లోపలికి ఎవరూ రాకుండా బలగాలను మోహరించారు. దీంతో ఆందోళనకారులు హోటల్‌పై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో హకీంపేట డిపోకు చెందిన బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. మరోవైపు సికింద్రాబాద్‌లోని వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో నిత్యం రద్దీగా కనిపించే సికింద్రాబాద్, దాని పరసర ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది.

'కొడంగల్' టెండర్లపై గోప్యత

మేఘా, రాఘవ కంపెనీలకు పనుల అప్పగింత

తాజాగా సీవోటీలో చర్చ.. వివరాల వెల్లడికి విముఖత

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్ఐఎస్) పనుల టెండర్లపై ఇరిగేషన్ శాఖ ఆది నుంచీ గోప్యతను పాటిస్తున్నది. తాజాగా, సీవోటీ (కమిషనర్ ఆఫ్ టెండర్స్)లో ఈ ప్రాజెక్టు పనుల టెండర్లు ఖరారైనట్టు తెలిసింది. కానీ, అందుకు సమాచారాన్ని ఇరిగేషన్ శాఖ, ప్రాజెక్టు అధికారులు వెల్లడించడం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో రూ.లక్ష ఎకరాలకు సాగునీటిని అందించడంతోపాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాల కోసం 2 ప్యాకేజీలుగా ఎన్‌కేఎల్ఐఎస్‌ను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మొదటి ప్యాకేజీలో పంచ్‌దేవ్‌పహాడ్, భూత్పూర్ పంపింగ్ స్టేషన్లతోపాటు పలు చెరువుల అభివృద్ధి చేపట్టనున్నారు. అందుకు రూ.1,134.62 కోట్లు అవుతాయని అంచనా వేశారు. రెండవ ప్యాకేజీలో రూ.1,126.23 కోట్ల అంచనా వ్యయంతో ఊట్కూరు, కానుకుర్తి పంపింగ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తంగా పంపింగ్ సిస్టమ్ కోసమే రూ.2,260.85 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇటీవల ఈ 2 ప్యాకేజీల పనులకు ఇరిగేషన్ శాఖ టెండర్లను ఆహ్వానించడంతో మొదటి ప్యాకేజ్ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రక్తసంబంధీకులకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, 2వ ప్యాకేజీ పనులను మేఘా కంపెనీ దక్కించుకున్నాయి.

అంచనా వ్యయం కంటే అధిక మొత్తానికి ఆమోదం

సాధారణంగా ఏ ప్రాజెక్టుకైనా ఎస్ఈ టెండర్లను ఆహ్వానిస్తారు. టెక్నికల్ బిడ్లను సదరు ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ఆమోదించాక ఫైనాన్షియల్ బిడ్ల కోసం అనుమతిస్తారు. ఫైనాన్షియల్ బిడ్లను తెరిచిన అనంతరం అందులో అన్ని అర్హతలు ఉన్న కంపెనీకి టెండర్లను ఖరారు చేస్తారు. ఆపై టెండర్లకు ఆమోదం తెలిపేందుకు సీవోటీకి పంపిస్తారు. తాజాగా ఎన్‌కేఎల్ఐఎస్‌కు సంబంధించిన 2 ప్యాకేజీల టెండర్లు కూడా సీవోటీ ముందుకు రావడంతో వాటిపై ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. తుదకు ఆ 2 టెండర్లలో ఎలాంటి మార్పులు చేయకుండా అంచనా వ్యయం కంటే 3.95% అధిక మొత్తానికి ఆమోదించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కానీ, అందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రాజెక్టు అధికారులు గానీ, ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు. ఇప్పటికే లోపాయికారిగా జరిగిన ఒప్పందాల మేరకే ఎన్‌కేఎల్ఐఎస్ టెండర్లను ఆ 2 కంపెనీలకు కట్టబెట్టారని, అందుకే గోప్యత పాటిస్తున్నారని ఇరిగేషన్ శాఖలో అధికారులు చర్చించుకుంటున్నారు.

లక్షన్నర కోట్లు ఊరికే అన్నాం

నా ఇల్లూ మూసీ బఫర్‌జోన్‌లో ఉంది: మంత్రి జూపల్లి

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ. లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని ఏదో జనరల్‌గా చెప్పామని, ఎంతవుతుందో తమకు తెలియదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తన ఇల్లు కూడా మూసీ ప్రాజెక్టులో కూలిపోతుందని తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి భవానీరెడ్డి పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలు

తొలుత 12 కేంద్రాల ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): బహిరంగ మార్కెట్లో మక్కల ధర పడిపోవడంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఎండీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నాఫెడ్ తరపున జగిత్యాల, నిర్మల్ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో 12 కేంద్రాలను శనివారం నుంచి ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుతం మక్కలకు మద్దతు ధర రూ. 2225 ఉండగా మార్కెట్లో 2వేల ధర పలుకుతున్నది.

అక్రమ రిజిస్ట్రేషన్.. తహసీల్దార్ రిమాండ్

చందుర్తి, అక్టోబర్ 19:ఒకరి భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన నాటి చందుర్తి తహసీల్దార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం అనంతపల్లికి చెందిన సలేంద్ర మల్లేశానికి 1.20 ఎకరాల భూమి ఉన్నది. అదే గ్రామానికి చెందిన సలేంద్ర లక్ష్మి, సలేంద్ర వేణు కలిసి అప్పటి తహసీల్దార్ డీ నరేశ్ సాయంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ చెప్పారు. నరేశ్ చందుర్తి తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని సలేంద్ర లక్ష్మి, వేణు పేరిట పట్టా మార్పిడి చేసినట్టు తేలిందని పేర్కొన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో పనిచేస్తున్న నరేశ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

వాణిజ్య

టర్మ్ ఇన్సూరెన్స్‌పై నో జీఎస్టీ!

సీనియర్ సిటిజన్లు తీసుకునే ఆరోగ్య బీమా పై కూడా..

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఆరోగ్య బీమా పాలసీదారులకు జీఎస్టీ కౌన్సిల్ త్వరలో శుభవార్తను అందించబోతున్నది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని ఎత్తివేయాలని వస్తున్న డిమాండ్‌పై జీఎస్టీ కౌన్సిల్ మంత్రివర్గ ఉపసంఘం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి శనివారం ఉపసంఘం సమావేశమై టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు, సీనియర్ సిటిజన్ల హెల్త్ బీమా ప్రీమియంపై జీఎస్టీని మినహాయింపు నివ్వాలని ఉపసంఘం సూచించింది. ఈ ఉపసంఘం సూచనలపై వచ్చే నెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైన తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. టర్మ్ ఇన్సూరెన్స్‌తోపాటు రూ.5 లక్షల వరకు తీసుకునే ఆరోగ్య బీమాపై 18 శాతం జీఎస్టీని విధిస్తున్నారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేతతో గండిపడనున్న ఆదాయాన్ని పూడ్చుకోవడానికి ఉపసంఘం..పలు వస్తువులపై జీఎస్టీని పెంచాలని సూచించింది. ముఖ్యంగా లగ్జరీ ఉత్పత్తులపై జీఎస్టీని 18 శాతం నుంచి 28 శాతానికి పెంచడం వల్ల రూ.22 వేల కోట్ల ఆదాయం సమకూరనున్నదని పేర్కొంది.

ఎఫ్‌వో ట్రేడింగ్ నష్టాల్లో తెలంగాణ టాప్

సగటున ఒక్కొక్కరికి రూ.1.97 లక్షలు లాస్

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌వో) ట్రేడింగ్‌లో వ్యక్తిగత నష్టాల్లో తెలంగాణ తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నట్టు సెబీ ఇటీవల విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. తెలంగాణలో ట్రేడర్లు సగటున రూ.1.97 లక్షలు నష్టపోగా..అదే ఏపీలో రూ.1.45